# అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: సీపీ


అమరుల స్తూపానికి గౌరవ వందనం చేస్తున్న సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, పోలీసు అధికారులు

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసులను స్ఫూర్తిగా తీసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ సోమవారం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రామగుండం కమిషనరేట్ ఆవరణలోని స్తూపం వద్ద నివాళులర్పించారు. అమరులైన పోలీసులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భద్రత కోసం ఎంతో మంది పోలీసులు ప్రాణాలు త్యాగం చేశారన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అసాంఘిక శక్తులతో జరిగిన పోరాటంలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు విడిచారని, వారి త్యాగాలను మరవకూడదన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరుల కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ చేతన, అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, కృష్ణ, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, మల్లారెడ్డి, ప్రతాప్, సుందర్‌రావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

# బాధలు వినండి.. భరోసా నింపండి

**ప్రజావాణిలో విన్నపాలు**

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బాధితులు సమస్యలను విన్నవించారు. భూసంబంధ, పింఛన్, రైతు భరోసా, కాలువల భూములు కబ్జా ఇలా పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. ప్రతి ఒక్కరి సమస్యను వింటూ పరిష్కరిస్తామనే భరోసా కలిగించారు.


సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

### రుణమాఫీ అమలేదీ

ప్రభుత్వం రూ.2 లక్షలపైనా ఉన్న పంట రుణం మాఫీ చేస్తామని ప్రకటించడంతో వడ్డీతో చెల్లించాం. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మాఫీపై స్పష్టత లేదు. బ్యాంకర్లు, అధికారుల చుట్టూ తిరిగినా సరైన సమాధానం రావడం లేదు. అర్హులైన మాకు రుణ మాఫీ చేసి న్యాయం చేయాలి.



**- ధర్మారం మండలం రచ్చపల్లి రైతులు**

### జనావాసాల్లో రైసు మిల్లు



మా కాలనీ జనావాసాల్లో రైసు మిల్లు నిర్మిస్తున్నారు. సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. ఇప్పటికే ఓ మిల్లు నుంచి వచ్చే దుమ్మూధూళితో ఇబ్బందులు పడుతున్నాం. మరో మిల్లుతో సమస్యలు మరింత తీవ్రం కానున్నాయి. మిల్లు పనులు నిలుపుదల చేయాలి.

**- రామగిరి మండలం కల్వచెర్ల బాధితులు**

### ఇంటి స్థల సమస్య

నా భర్త స్వాతంత్ర్య సమరయోధుడు కావడంతో ఇంటి స్థలం కోసం ప్రభుత్వానికి నివేదించగా ఇటీవల సుల్తానాబాద్‌లో 2 గుంటల భూమి పట్టా పంపిణీ చేసి హద్దులు నిర్ణయించారు. తమకు కేటాయించిన భూమిలో కొందరు ప్రహరీ నిర్మించారు. ఇంటి స్థలం సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి.


**- సుందరమ్మ, సుల్తానాబాద్**



### పట్టాహక్కులు కల్పించాలి

గ్రామంలో రెండు సర్వే నంబర్లలో 36 గుంటల భూమి ఉంది. ఏళ్లుగా సాగులో ఉన్నా.. కొత్త పట్టా పాస్‌పుస్తకం లేదు. ఆన్‌లైన్‌లో మరొకరి పేరిట తప్పుగా నమోదైంది. పట్టా హక్కులు లేక పంట రుణం, పంట బీమా, రైతు భరోసా కోల్పోతున్నా. భూమికి పట్టా ఇప్పించాలి.

**- రాజయ్య, ఆరెంద, మంథని మండలం**



### పింఛన్ ఇప్పించి ఆదుకోరూ

రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాను. ఎటూ కదలలేని పరిస్థితి. ఏ పని చేయలేకుండా ఉన్నా. తల్లి పోషణపై ఆధారపడాల్సి వస్తోంది. దివ్యాంగ వైకల్య ధ్రువీకరణ పత్రం ఉంది. పింఛన్ మంజూరు చేసి ఆర్థిక ఆధారం చూపాలి.

**-సుమన్, దివ్యాంగుడు, కమాన్‌పూర్**



# కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు


చిన్నకల్వలలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

**సుల్తానాబాద్, న్యూస్‌టుడే:** వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల పీఏసీఎస్ ఆధ్వర్యంలో చిన్నకల్వలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఏఈవో ఇచ్చే టోకెన్, ధాన్యం రకం, పరిమాణం, నాణ్యత వివరాలను పరిశీలించి ధాన్యం తూకం వేయాలన్నారు. ఆయన వెంట డీసీవో శ్రీమాల, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాల కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా టార్పాలిన్లు సమకూర్చుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

# అన్నదాతలు ఆందోళన చెందొద్దు

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


అబ్బాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

**ధర్మారం, జూలపల్లి, న్యూస్‌టుడే:** ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మారం మండలంలో పత్తిపాక, నందిమేడారంతోపాటు జూలపల్లి మండలం అబ్బాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో బస్తాకు అయిదు కిలోల వరకు కోత విధించి రైతులను మోసం చేశారన్నారు. తాలు, బియ్యం శాతం తక్కువగా ఉందనే నెపంతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేశారని.. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ నేరుగా అన్నదాతల ఖాతాలోకి చేరుతుందన్నారు. కొనుగోళ్లలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు విప్ సూచించారు. రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని.. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే 80 శాతం మంది రైతులకు మాఫీ అయిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖని సీనియర్ సివిల్ జడ్జిగా సూరజ్‌సింగ్




**గోదావరిఖని, న్యూస్‌టుడే:** గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జిగా జీవన్ సూరజ్‌సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన సూరజ్‌సింగ్ పదోన్నతిపై గోదావరిఖనికి బదిలీపై వచ్చారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు పెద్దపల్లికి బదిలీ అయ్యారు.

# పారదర్శకతతో ముందుకెళ్తా!

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే నా లక్ష్యం
- శాతవాహన ఉప కులపతి ఉమేశ్‌కుమార్

ముఖాముఖి



ఈనాడు, కరీంనగర్

విశ్వవిద్యాలయంలో విద్యా వికాసం.. ఉన్నత విలువల ఆచరణపై దృష్టి పెడతానని ఉపకులపతి ఉమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఈనాడు'తో ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు. అన్ని వ్యవహారాల్లో పారదర్శకతతో ముందుకెళ్తా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడతానని పేర్కొన్నారు. సమస్యల సవాళ్లను తనకున్న అనుభవంతో అధిగమిస్తానని.. ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా విద్యార్థులకు వసతులు కల్పిస్తానని చెప్పారు.

### మార్పు చూపిస్తా

నా హయాంలో కచ్చితంగా పాలనా వ్యవహారాల్లో మార్పు చూపిస్తా. అన్ని విషయాల్లో పారదర్శకతే నా మంత్రం. అదే పంథాలో ముందుకు వెళ్తా. చిన్నచిన్న సమస్యలు ఎక్కడైనా ఉంటాయి. వాటిని నా స్థాయిలో పరిష్కరిస్తా. పెద్ద సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూస్తా. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం నాకు ఉపయుక్తంగా మారుతుంది. అప్పటికన్నా ఇప్పుడు వీసీ హోదాలో కొన్నింటి విషయంలో నిర్ణయాధికారం ఉండటంతో మెరుగైన చర్యలు తీసుకోగలను.

### బాధ్యులపై చర్యలు తప్పవు

విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో జరిగిన అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. నా వంతు సహకారం అందిస్తా. అదే సమయంలో నా దృష్టికి వచ్చిన ఏ విషయాన్నీ విస్మరించను. అక్రమ నియామకాలు, దొడ్డిదారిన పదోన్నతులు.. ఇలా విద్యా వ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసిన ప్రతి విషయంపై సమగ్రంగా విచారణ జరుగుతుంది. తప్పకుండా బాధ్యులపై చర్యలుంటాయి.

### న్యాక్ గుర్తింపునకు నా మొదటి ప్రాధాన్యం

నా మొదటి ప్రాధాన్యం శాతవాహనకు న్యాక్ గుర్తింపు తేవడం. ఇందుకోసం అవసరమైన ప్రణాళికతో ముందడుగు వేస్తా. గుర్తింపు సాధిస్తే నిధులు సమృద్ధిగా వస్తాయి. విద్యాపరంగా సమూలమైన మార్పులకు అవకాశం ఉంటుంది. 200 ఎకరాల భూమి అందుబాటులో ఉండటంతో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నది నా రెండో ప్రాధాన్యత. తరువాత బీఈడీ, ఎంఈడీ కళాశాలల ఏర్పాటు సహా పీహెచ్‌డీకి అవకాశాన్ని కల్పిస్తాం. దీర్ఘకాలికంగా ఇక్కడ ఉన్న ప్రధాన సమస్యలు జిల్లాకు చెందిన మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపిస్తా. మౌలిక వసతుల కల్పన పరంగా మంచి మార్పులు తీసుకొస్తా. ఈ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా నా శాయశక్తులా కృషి చేస్తా. మూడేళ్లలో ఇదొక మంచి గురుకులమనే భావనను విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో కల్పిస్తా.

### కొత్త కోర్సులు.. పోస్టులు..

జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ప్రకారం ఉన్నత విద్యలో ఎన్నో మార్పులొస్తున్నాయి. పోటీ ప్రపంచంలో విద్యార్థికి బహుళ ప్రయోజనంతో కూడిన విద్యను అందించే వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ఇష్టానుసారంగా వేరే కోర్సుల్లోకి మారే వెసులుబాటుతోపాటు ఎన్నో అవకాశాలు కొత్త విద్యా విధానంలో ఉండనున్నాయి. ఇక్కడ ప్రస్తుతం నడుస్తున్న సంప్రదాయ కోర్సుల స్థానంలో డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెడతాం. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఆవశ్యకతను గుర్తిస్తాం. బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలు అధికంగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ప్రభుత్వానికి విన్నవిస్తా. కొత్త పోస్టులను కూడా మంజూరు చేయిస్తా. గతంలో నేను రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు ఒకసారి స్నాతకోత్సవం జరిగింది. త్వరలో మరోసారి నిర్వహిస్తాం.

### విద్యార్థుల బాధలు తెలిసిన వ్యక్తిని..

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు పేద విద్యార్థుల బాధలు తెలుసు. దీపం వెలుతురులో చదువుకుని ఈ స్థాయికి వచ్చాను. నేను విద్యార్థుల పక్షపాతిని. రీసెర్చ్ స్కాలర్‌గా విద్యార్థి సంఘ నాయకుడిగానూ పని చేశాను. విద్యార్థులు వచ్చి నాకు సమస్యలు విన్నవించే కన్నా.. నేనే వారి వద్దకు నిత్యం వెళ్తా. ఆకస్మిక తనిఖీలు చేస్తా.

### బాధ్యతల స్వీకరణ

**కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్యులు ఉమేశ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మొదట ఆయనకు బోధన, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించిన తదుపరి బాధ్యతలు స్వీకరించారు. వీసీకి పలు ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపకులపతిని కలిసిన వారిలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, బీసీ సంఘాల నేత శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు


మంథని మార్కెట్ యార్డులో సిద్ధంగా ప్యాడీ క్లీనర్లు



ధర్మారం: రామయ్యపల్లిలో సన్నధాన్యం కొనుగోలుకు కేటాయించిన స్థలం

ధాన్యం కొనుగోలుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నరకాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సేకరణ కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యం కలిసి కల్తీ జరగకుండా ఉండేలా ధాన్యం కుప్పలు పోసేందుకు వేర్వేరుగా స్థలాలు కేటాయించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. సన్నరకాలు నింపిన గన్నీ సంచులను ఎర్రటి నైలాన్ దారంతో.. దొడ్డు రకాల సంచులకు సుతిలీదారంతో కుట్టు వేయనున్నారు. ఏది సన్నరకమో.. ఏవి దొడ్డు రకాలో ఏఈవో నిర్ధారిస్తారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు మంథని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 37 ప్యాడీ క్లీనర్లను సిద్ధంగా ఉంచినట్లు సంఘం ముఖ్య కార్యనిర్వాహకాధికారి అశోక్ తెలిపారు.

**- న్యూస్‌టుడే, ధర్మారం, మంథని**

# చట్టాలపై అవగాహనతో నేరాలకు దూరం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేశ్

**సుల్తానాబాద్, న్యూస్‌టుడే:** చట్టాలపై అవగాహన కలిగి నేరాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ పేర్కొన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలలో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు, మహిళలకు ఉచితంగా న్యాయసలహాలు అందుతున్నాయని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తి తగదాలు, చెక్‌బౌన్స్, చిన్న గొడవల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి శ్రీరాములు, రమేశ్, ఏజీపీ ఆంజనేయులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో





# లోతులో పొరలు.. తీసేందుకు అధిక ఖర్చు

### పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి వ్యయం

గోదావరిఖని, న్యూస్‌టుడే

సింగరేణి గనుల్లోని బొగ్గు పొరలు లోతులో ఉండటంతో వాటిని వెలికి తీసేందుకు సంస్థకు అధిక వ్యయమవుతుంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. దీంతో టన్ను ఉత్పత్తికి ఉపరితల గనుల్లో రూ. 3 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. మార్కెట్‌లో టన్నుకు రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తుంది. అయితే భూగర్భ గనుల్లో ఉత్పత్తవుతున్న బొగ్గు ప్రతి టన్నుకు రూ.10 వేల వరకు వెచ్చించి.. మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకే విక్రయిస్తుంది.

### ఇతర కంపెనీల కంటే ఎక్కువ

సహజ సిద్ధంగా ఏర్పడ్డ బొగ్గు పొరలు లోతులో ఉండటంతోనే సింగరేణి భారీగా వ్యయం వెచ్చించాల్సి వస్తుంది. దీంతో సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో.. ఇతర కంపెనీల కంటే బొగ్గు ధర ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. సింగరేణి పరిధిలో ఉన్న గనుల్లో భూగర్భ పరిస్థితుల ప్రకారం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే ఆరు టన్నుల మట్టిని ఉత్పత్తి చేయాల్సి వస్తుంది.

### ఇతర రాష్ట్రాల్లో పైపైనే..

తెలంగాణలో ఉన్న బొగ్గు నిక్షేపాల కంటే ఇతర రాష్ట్రాల్లోని పొరలు తక్కువ లోతులో ఉన్నాయి. ప్రధానంగా ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌లోని గనుల్లో.. కేవలం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే రెండు నుంచి మూడు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. సింగరేణిలో స్ట్రిప్పింగ్ రేషియో 6 నుంచి 8 వరకు ఉంది. ఇతర రాష్ట్రాల్లో 2.8 నుంచి 3.5 వరకు మాత్రమే ఉంది. దీనివల్ల అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది. బొగ్గు ధర తక్కువగానే ఉంటుంది.


బొగ్గు తొలుస్తున్న షేరర్ యంత్రం

### 36 మిలియన్ టన్నులు వీటికే..

ఎన్టీపీసీకి రామగుండం ప్రాంతంలోని గనులు, జెన్‌కోకు చెందిన కేటీపీఎస్‌కు కొత్తగూడెం, కేటీపీపీకి భూపాలపల్లి, బీటీపీపీకి మణుగూరు గనులు సమీపంలోనే ఉండటంతో బొగ్గు రవాణా ఛార్జీల భారం లేకుండా పోయింది. సింగరేణి ఏటా ఉత్పత్తి చేస్తున్న 70 మిలియన్ టన్నుల్లో 36 మిలియన్ టన్నుల బొగ్గు వీటికే రవాణా చేస్తోంది. మిగతా బొగ్గు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు కేంద్రాలకు రవాణా చేస్తోంది.

### కలిసివస్తున్న రవాణా భారం

సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర కంపెనీల నుంచి రవాణా చేసుకోవడం వినియోగదారులకు భారంగా మారుతుంది. అక్కడి బొగ్గు ధరతోపాటు రవాణా ఛార్జీలు కలిపితే అదే స్థాయిలో ధర అవుతుండటంతో సింగరేణి నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు ఎక్కువగా ఇక్కడి బొగ్గును తీసుకుంటున్నాయి. కొన్ని విద్యుత్తు కేంద్రాలకు పిట్‌హెడ్ పరిధిలోనే గనులు ఉండటంతో రవాణా భారం లేకుండా పోతుంది.

## వారిది తప్పుడు ప్రచారం : ఎమ్మెల్యే

**పెద్దపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనే దురుద్దేశంతో భారాస నాయకులు రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీపై ఏ గ్రామంలోనైనా చర్చలకు తాను సిద్ధమన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భారాస నాయకులు మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపించారు.

# ఆవ సాగు.. ఇదే అదను





ఆవ పైరు

జగిత్యాల సహా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆవ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. తక్కువ నీటి వసతి ప్రాంతాల్లో, అడవి పందులు, కోతుల బెడదను తప్పించుకోవడానికి చాలామంది రైతులు యాసంగి పంటగా ఆవపైరును పండిస్తున్నారు. ఆవాల పంటలో మేలైన యాజమాన్యం గురించి **పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రజనీకాంత్** వివరించారు.

■ ఆవపంటను అక్టోబరు నుంచి నవంబరు 25వ తేదీ వరకు విత్తుకోవచ్చు. స్థానిక, సంకర రకాలతో పాటుగా కొన్ని కంపెనీల ద్వారా ఒప్పందంతో రైతులు ఆవాలు సాగు చేస్తున్నారు. నల్లరేగడి నేలల్లో ఎక్కువగా ఆవాలను పండిస్తుండగా రకాలను బట్టి 80-110 రోజుల కాలపరిమితి ఉంటుంది. విత్తిన నెల రోజుల తరువాత 35 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. విత్తిన నెల రోజులవరకు తోటలో కలుపు లేకుండా చూడాలి. నల్లనేలల్లో 3-4 నీటితడులు, తేలిక నేలల్లో పండించిన పంటకు 4-5 నీటితడులు అవసరముంటాయి. పైరు మొలిచిన తరువాత 20-25 రోజులకు

రైతేరాజు

మొదటి తడినిచ్చి కొమ్మలు వేసే సమయంలో, పూత సమయంలో, గింజలు పోసుకునే దశల్లో తప్పనిసరిగా నీటి తడులను పారించాలి.

■ డైమండ్ బ్లాక్‌మాత్ లద్దె పురుగులు ఆకుల అడుగున చేరి గీరితింటాయి. ఉద్ధృతి ఎక్కువున్నప్పుడు కొమ్మలను, పూత, పిందెలను కూడా తింటాయి. నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము మందును లీటరు నీటికి వంతున కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుమూడు దఫాలుగా పిచికారీ చేయాలి.

■ ఆవాలను ఆలస్యంగా విత్తినప్పుడు పేనుబంక తీవ్రత పెరుగుతుంది. ఈ పురుగు నివారణకు మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో మరోసారి మందుద్రావణాన్ని పిచికారీ చేయాలి.

■ డౌనీమిల్‌డ్యూ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాండం, పుష్పగుచ్ఛాలు, కాయల మీద తెల్లటి ఉబ్బెత్తు పొక్కులు కనిపిస్తాయి. డౌనీమిల్‌డ్యూతో పాటుగా ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ నివారణకు 2.5 గ్రాముల డైథేన్‌ఎం-45 లేదా 2.5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి వంతున కలిపి పైరుపై పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

■ మంచు ఎక్కువగా ఉంటే బూజు తెగులు ఆశిస్తుంది. ఆకులపై తెల్లటి బూజు వంటి పదార్థం కనిపిస్తే వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కేరాథేన్ 2.5-3 గ్రాముల మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం**

**పంటల సాగులో కర్షకుల సందేహాలను అగ్రానమీ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు నివృత్తి చేశారు.**



రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

**కాలీఫ్లవర్‌లో గోధుమ రంగు మచ్చలు వస్తున్నాయి.**
**- మల్లన్న, తిమ్మాపూర్**

బోరాన్ దాతు లోపం కారణం. లీటరు నీటికి ట్రైసోడియం ఆక్టా బోరేట్ మందు 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

**పసుపులో దుంప కుళ్లు వ్యాపిస్తోంది. నివారణకు ఏం చేయాలి.**
**- తిరుపతిరెడ్డి, మల్రివానిపల్లి**

**సమాధానం:** దుంప కుళ్లును గుర్తించిన వెంటనే నివారణకు 3 గ్రాముల రిడోమిల్ ఎంజెడ్‌ను లీటరు నీటిలో కలిపి దుంపలు తడిచేలా మొక్కల చుట్టూ తడపాలి.

**చిక్కుడులో పేనుబంక నివారణకు ఏం చేయాలి. – కరుణాకర్, కరీంనగర్**

ఫిప్రోనిల్ మందు 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, జమ్మికుంట

## నారుమడి యాజమాన్యంతోనే మొక్కల ఎదుగుదల

మీకు తెలుసా?

ప్రస్తుత యాసంగిలో కూరగాయల సాగుకు ఇది అనువైన సమయం కాగా నారుమడిలో చేపట్టే యాజమాన్యంతోనే నారు సరిగా ఎదిగి నాటిన తరువాత మంచి కాపు వస్తుంది. టమాట, వంగ, మిరప, ఉల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితరాల్లో విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చు పురుగు నివారణకు ఆర్థోఫాస్పేట్, ఇమిడాక్లోప్రిడ్ వంటివాటితో విత్తనశుద్ధి చేయాలి. వడలు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి పట్టించాలి. ఎత్తయిన నారుమడిని తయారు చేసుకుని వరుసల్లో విత్తనాలను విత్తుకోవాలి. విత్తనాలు మొలకెత్తే వరకు రోజ్‌క్యాన్‌తో నీటిని చల్లాలి. నారుమడిలో కలుపు లేకుండా చూడాలి, నారు మొలకెత్తిన 15 రోజులకు ఫ్యురడాన్ 3జి గుళికలను చల్లాలి. రసం పీల్చు పురుగు, తెగుళ్ల నివారణకు డైమిథేయేట్, మాంకోజెబ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఆరోగ్యవంతంగా ఎదిగిన నారును సాయంత్రం పూట ప్రధాన పొలంలో నాటుకొని నీటి తడి పారించాలి.

– న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

# లాభాల మిరప

న్యూస్‌టుడే, గంగాధర



ఇటీవల భారీ వర్షాలు కూరగాయల సాగు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో గంగాధర మండలం లింగంపల్లికి చెందిన పోల్సాని కిరణ్‌రావు కేవలం 25 గుంటల్లో మిరప పంట సాగు చేసి లాభాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### 25 గుంటలు.. రూ.60 వేల పెట్టుబడి..

కోతుల బెడద లేని మిరప సాగు ఎంచుకొన్న కిరణ్‌రావు.. 25 గుంటల్లో సాగు చేపట్టారు. డెక్కన్-887, జెర్సీ-56 రకం విత్తనాలకు రూ.5 వేలు వెచ్చించారు. దున్నకానికి రూ.4 వేలు, పురుగు మందుల పిచికారీకి రూ.15 వేలు, మల్చింగ్‌కు రూ.10 వేలు, కోడి ఎరువులకు రూ.8 వేలు, అడుగు మందులకు రూ.6 వేలు, కర్రలు పాతడానికి కూలీలకు రూ.6 వేలు, ఇతర ఖర్చులు రూ.5 వేలు కలిపి రూ.60 వేల పెట్టుబడి పెట్టారు. రెండు నెలలకు మిరప కాత మొదలవగా ఇప్పటికే 60 క్వింటాళ్ల మిరపకాయలను కరీంనగర్ మార్కెట్‌లో విక్రయించారు. కిలోకు రూ.20 చొప్పున రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడులుపోను రూ.60 వేల లాభం వచ్చింది. ఇంకా మూడు నెలల్లో దాదాపు 80 క్వింటాళ్ల దిగుబడి రానుంది. మరో 30 గుంటల్లో మిరప సాగుకు దుక్కి సిద్ధం చేశారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాలేదని రైతు తెలిపారు. మల్చింగ్, కర్రలు పాతి మిరప చెట్ల కొమ్మలు నేలకు తాకకుండా చర్యలు తీసుకోవడంతో కాత బాగా వచ్చిందని చెప్పారు.

# పోషకాలు.. ఆరోగ్యానికి బాటలు


నేడు జాతీయ గింజల దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం


ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. ప్రచార మాధ్యమాలు.. వైద్య నిపుణుల సలహా మేరకు ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకుంటున్నారు. నిత్యం భుజించే పదార్థాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలతో మందులకు వెచ్చించే సగం డబ్బులతో. . అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కార్బొహైడ్రేట్లకు బదులుగా పోషకాహారంపై దృష్టి సారిస్తున్నారు. కరోనా తర్వాత అధిక మంది గింజలు తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నేడు జాతీయ గింజల దినోత్సవం సందర్భంగా వాటి వినియోగం ఉమ్మడి జిల్లాలో ఎలా పెరిగింది. వాటితో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం.

### పెరిగిన వినియోగం..

కరోనా తర్వాత ఉమ్మడి జిల్లాలో గింజల వినియోగం పెరిగింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటిని తింటున్నారు. కాకపోతే ఖర్చు ఎక్కువ కావడంతో సగం మంది మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలు మాత్రం పేదోడి గింజగా పేరొందిన వేరుశనగను తింటున్నారు. 20 ఏళ్ల కిందట కరీంనగర్ టవర్ సర్కిల్‌లో గింజల దుకాణాలు ఒకటి, రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు నగరంలో చాలా ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒకప్పుడు జనాభాలో 5 శాతం మంది మాత్రమే వీటిని తినేవారు. ప్రస్తుతం 40 శాతం మంది ఏదో ఒకటి, రెండు రకాలు కొనుక్కొని వెళ్తున్నారని వ్యాపారి రమేష్ తెలిపారు.



### ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యం..



బయట ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నాణ్యత, శుచి, శుభ్రత పాటించడం తగ్గిపోయింది. కరోనా తర్వాత ప్రతి రోజు ఉదయం గింజలు, ఎండుఫలాలను తీసుకుంటున్నా. ఖర్చు కంటే ఆరోగ్య ముఖ్యమని భావించి వీటిని తీసుకుంటున్నా. మధ్యాహ్నం కొద్దిగా అన్నం తింటున్నా.

**- రాజన్న, నీటి పారుదల శాఖ ఉద్యోగి**

### మా పిల్లల స్నాక్స్ బాక్స్‌లో..



మా ఇద్దరు పిల్లలు బడికి స్నాక్స్ తీసుకెళ్తుంటారు. అందులో బయటి తినుబండారాలు పెట్టను. పండ్లు పెడదామన్నా.. మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. అందుకనే బాదం, కాజులాంటివి పెట్టి పంపిస్తున్నాం. కొన్ని సార్లు బాదం, కాజు, ఎండుద్రాక్ష, కర్జూరాలతో లడ్డూగా చేసి ఇస్తున్నాం. ఒక్కోసారి పల్లి పట్టీలు చేస్తున్నా. బాదం నానబెట్టి తినిపిస్తుంటాం. **- రంగ అనూష, గృహిణి, కరీంనగర్**

### విటమిన్లు.. ఖనిజాలు..

■ గింజలు బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, పొద్దుతిరుగుడు ఇలా అనేక రకాల్లో లభిస్తున్నాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు(మాంసకృత్తులు), ఫైబర్(పీచు), విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం చాలామంది అల్పాహారంలో భాగంగా వీటిని తీసుకుంటున్నారు. రాత్రిపూట తీసుకుంటే జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయి.




**- సాయిప్రియ, పోషకాహార నిపుణురాలు**

■ బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజు గుప్పెడు గింజలు ఆహారంలో భాగం చేసుకోవాలి.



■ **వాల్‌నట్స్ :** మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటివి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తాయి.



■ **జీడిపప్పు:** గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఇందులో ఉంటుంది. అల్పాహారంలో భాగంగా తీసుకుంటే మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు నియంత్రణలో ఉంటాయి.



**గుమ్మడిగింజలు:** శరీరానికి ప్రొటీన్ మెగ్నీషియం, ట్రిప్టోఫాన్‌లు అధికంగా లభిస్తాయి.

■ **పొద్దుతిరుగుడు విత్తనాలు:** కంటిచూపు మెరుగుపరచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి.



■ **బాదం:** విటమిన్స్‌తోపాటు కొవ్వు, ప్రొటీన్ అధికంగా లభిస్తాయి. శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి.

■ **పిస్తా పప్పులు:** వీటితో శరీరానికి అధిక ప్రొటీన్ లభిస్తుంది. కంటి చూపు మెరుగుపర్చడంలో మేలు చేస్తుంది.

■ **వేరుశనగలు(పల్లీలు):** కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడతాయి.



## ఎస్సారెస్పీకి భారీగా వరద

**జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:** గోదావరి పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 67,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 17 స్పిల్‌వే గేట్లద్వారా 52,108 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 2,200, లక్ష్మీ కాలువకు 150, వరద కాలువకు 5 వేలు, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగిస్తున్నారు.

## పెరిగిన పత్తి విక్రయాలు

**జమ్మికుంట, న్యూస్‌టుడే:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు క్రమేణా పెరుగుతున్నాయి. సోమవారం యార్డుకు 251 ట్రాలీల విడిపత్తి విక్రయానికి రావటం విశేషం. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌కు అధికంగా వచ్చిన పత్తి ఇదే. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.7,000 ధర పలికింది. 25 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,400 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. మార్కెట్‌లో శుక్రవారం పలికిన ధరే సోమవారం పలికింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీపావళి సమీపిస్తుండటంతో అధిక పత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ధర నిలకడగా పలుకుతున్న పత్తిని అధిక తేమతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. స్థానిక సీసీఐ సిబ్బంది ఒకరు మార్కెట్ యార్డులో పత్తి నాణ్యతను పరిశీలించారు.



# యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా

న్యూస్‌టుడే, రామడుగు

రామడుగు మండలం వన్నారం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా దందా కాసులు కురిపిస్తోంది. నిత్యం 50 ట్రాక్టర్లతో సుమారు 200 ట్రిప్పులు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు ఇసుకకు రూ.2 వేల నుంచి



వన్నారం వాగులో ఇసుక టాక్టర్ల గుర్తులు

రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. పగలు బహిరంగంగా తరలిస్తే రైతులు వ్యతిరేకిస్తారని, చీకటి పడగానే ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా రామడుగు మండలం సరిహద్దు గ్రామమైన వన్నారం నుంచి బైపాస్ దారి కొత్తపల్లి, కరీంనగర్‌కు తీసుకెళ్లేందుకు అవకాశంగా మారింది. సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందని సమాచారం. గతంలో సర్పంచి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని పంచాయతీ కార్యాలయంలో తాళం వేసుకొని నిరసన తెలిపారు. కానీ ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టలేదు. నిత్యం రూ.4 లక్షల విలువైన ఇసుక అక్రమ దందా కొనసాగుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ గ్రామంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం లభించేదని తెలిపారు.



కదంబాపూర్: దామెర చెరువులో వలస పక్షులు

## వలస పక్షుల కనువిందు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ శివారులోని దామెర చెరువులో ఎర్రకాళ్ల కొంగలుగా పిలువబడే 'పెయింటెడ్ స్టార్క్స్' కనువిందు చేస్తున్నాయి. పొడవైన ముక్కు, గులాబీ రంగు కాళ్లు, రంగురంగుల రెక్కలు కలిగి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చిన్న కప్పల్ని, చేపల్ని ఆహారంగా తీసుకునే వీటి జీవిత కాలం 28 సంవత్సరాలు. కొంగజాతికి చెందిన ఈ వలస పక్షులు.. సాధారణంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కొల్లేరు, నేలపట్టు సరస్సుల్లో దర్శనమిస్తాయి. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల చెరువులు, కుంటల్లో అక్టోబర్ నుంచి జూన్ వరకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ పక్షులు చెరువు, కుంటల సమీపంలో ఉండే చెట్లపై గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి తమ సంతానోత్పత్తిని పెంపొందించుకొని పిల్లలతో సహా వలస వెళ్తుంటాయని జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సంగీతారాణి తెలిపారు.

**- ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్**

# అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

**కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే:** బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి(పోక్సో కోర్టు) డి.వెంకటేశ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. రామడుగు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఇంటర్ చదివే బాలిక బంధువులు బోయినపల్లి మండలంలోని ఒక గ్రామంలో ఉండటంతో తరచూ అక్కడికి వెళ్లేది. అదే గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్‌కుమార్ అనే యువకుడు బాలికతో పరిచయం పెంచుకొని ఫోన్లో మాట్లాడేవాడు. 2022 ఫిబ్రవరి 21న బాలికను తన గ్రామానికి రమ్మని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో అతని వద్దకు వెళ్లింది. ఆమెను వరంగల్ జిల్లాకు తీసుకెళ్లి పెళ్లి చేసుకొని, బలవంతంగా అత్యాచారం చేశాడు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి కరీంనగర్ తీసుకొచ్చి బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. ఆమె తల్లిదండ్రుల వద్దకు చేరుకొని జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు రామడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితున్ని అరెస్ట్ చేసి.. దర్యాప్తు అనంతరం చొప్పదండి సీఐ రవీందర్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డి.వెంకటేష్ ప్రేమ్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.

## ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

**సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం అధికారులు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కొంత మంది బాలికలు షీ టీం సిబ్బంది వద్దకు వచ్చి ఉపాధ్యాయుడు నరేందర్ కొద్ది రోజులుగా విద్యార్థినుల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# పది రోజులే గడువు

## ఉమ్మడి జిల్లాలో 71 శాతమే సీఎంఆర్ సేకరణ


ఈనాడు, సిరిసిల్ల

ప్రభుత్వం సీఎంఆర్ సేకరణలో జాప్యం వీడటం లేదు. మర ఆడించిన బియ్యం నింపేందుకు గన్నీ సంచుల కొరత, గోదాంల్లో స్థలాభావం తదితర కారణాలతో లక్ష్యం చేరుకోవడంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణ లక్ష్యం 71 శాతం చేరుకుంది. ఈ నెల 31తో గడువు ముగుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. పది రోజులే సమయం ఉండటంతో శత శాతం పూర్తి చేయడంపై సందిగ్ధం నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు పౌరసరఫరాలశాఖ వివిధ కేంద్రాల ద్వారా 30.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. నాలుగు జిల్లాల పరిధిలోని మిల్లులు 20.33 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్‌గా ఇవ్వాలి. ఇప్పటి వరకు 15.05 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

■ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చే క్రమంలో నాణ్యత పేరుతో కోత విధించడం, నిల్వ చేద్దామంటే గోదాంల్లో స్థలాభావం ఇవన్నింటికీ తోడు రవాణా ఛార్జీలు భారంగా మారుతున్నాయి.

■ ఖరీఫ్ సీజన్‌కు ఇంకా 29 శాతం బియ్యం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది.



మిల్లులో బియ్యం నిల్వలు

■ 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 50శాతంపైనే సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కాగా దీనికి గడువు ఉండటంతో ప్రస్తుతం మిల్లర్లు గత ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించారు.

### గడువులోపు పూర్తిచేస్తాం

జిల్లాలో బియ్యం సేకరణ లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేస్తాం. ప్రత్యేక అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మిల్లుల వారీగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మిల్లర్లు అన్ని సమస్యలను అధిగమించి సేకరణ లక్ష్యం శతశాతం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**-ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల**

### జరిమానా

ప్రభుత్వానికి రెండు, మూడు సీజన్‌లుగా సీఎంఆర్ అప్పగించడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లను పౌరసరఫరాలశాఖ డిఫాల్టర్లగా గుర్తించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పది మిల్లులు ఉన్నాయి. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఒక మిల్లరు 2021-22 సంవత్సరానికి 41 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 2023 మార్చిలోగా సీఎంఆర్‌కు ఇవ్వాలి. గడువు పూర్తయినా ఇంకా 1,450 క్వింటాళ్ల సీఎంఆర్ ఇవ్వలేదు. పౌరసరఫరాలశాఖ ఆ మిల్లుకు రూ.5.56 లక్షల పెనాల్టీ విధించింది.

**ఉమ్మడి జిల్లాలో 2023-24 వానాకాలం ధాన్యం సేకరణ (లక్షల మెట్రిక్ టన్నుల్లో)**

| | పెద్దపల్లి | జగిత్యాల | కరీంనగర్ | రాజన్నసిరిసిల్ల |
|---|---|---|---|---|
| సేకరించింది | 1.92 | 3.10 | 23.24 | 2.07 |
| ఇవ్వాల్సింది | 1.29 | 2.07 | 15.62 | 1.35 |
| అందజేసింది | 0.88 | 1.35 | 12.23 | 1.05 |

### ఇవీ సమస్యలు...

ప్రభుత్వం ధాన్యం కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేస్తున్నా మిల్లర్లు పలు సమస్యలతో సీఎంఆర్ ఇవ్వలేకపోతున్నారు.

■ ప్రభుత్వం మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేశాకే సేకరణ లక్ష్యం నిర్ణయించాలి. దొడ్డు రకం క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలి. మిల్లింగ్ అయ్యాక సగటున 62 కిలోలు మాత్రమే వస్తుంది.

■ పోర్టిఫైడ్ బియ్యం కోసం మిల్లుల్లో ఎఫ్ఆర్‌కే, సార్టెక్స్ యంత్రాలు అమర్చుకున్నారు. క్వింటాల్‌కు 3 యూనిట్లు ఖర్చయ్యేది సగటున 4.5 యూనిట్లకు పెరిగింది. దీంతో మిల్లు ఎల్‌టీ కేటగిరి నుంచి హెచ్‌టీలోకి మారుతుంది. దీంతో విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి.

■ పాత గన్నీ సంచుల్లో బియ్యం నింపి గోదాంల్లో నిల్వ ఉంచుతున్నారు. ధాన్యం సంచులను శుభ్రం చేయకపోవడంతో అందులో క్రాప్రా పురుగులు పెరుగుతున్నాయి. దీంతో ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం తీసుకోవడం లేదు.

■ మిల్లర్లు ధాన్యం మర ఆడించినందుకు క్వింటా బియ్యానికి రూ.10, బియ్యాన్ని గోదాంలకు తరలించే రవాణా ఛార్జీలను ప్రభుత్వం ఆరేళ్లుగా ఇవ్వడం లేదు.

■ గోదాంల్లో బియ్యం నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.240, క్వింటా ధాన్యానికి కిలో తరుగును ప్రభుత్వం మిల్లర్లకు ఇవ్వాల్సి ఉన్నా అయిదేళ్లుగా చెల్లించడం లేదు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, కమాన్‌పూర్

? కమాన్‌పూర్ ఠాణా రోడ్డు నుంచి ముల్కలపల్లి వైపు వెళ్లే దారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందికరంగా మారింది. ఉదయం నడకకు వెళ్లే సమయంలో సమస్యగా ఉంది. - **స్థానికులు**

✔ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టి పిచ్చిమొక్కలు లేకుండా చూస్తాం. - **రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, కమాన్‌పూర్**

# ఇళ్ల మధ్యే మురుగు



కొంతంవాడలో ఇళ్ల పక్కనే నిలిచిన మురుగు

**న్యూస్‌టుడే, పెద్దపల్లి**

రైతు కుటుంబాలు కావడంతో పశువుల పోషణ, నిర్వహణ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు ఎస్సారెస్పీ కాలువను మున్సిపల్ సిబ్బంది వ్యర్థాల డంపింగ్‌కు వినియోగించడంతో కొంతంవాడ, ప్రగతినగర్ ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో కాలనీతోపాటు బస్టాండ్ ప్రాంతంలోని మురుగు కూడా ఇదే ప్రాంతంలోకి వస్తోంది. అవతలి వైపు ఎస్సారెస్పీ కాలువ ఉండడంతో మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

**ప్రమాదకరంగా కాలువ రోడ్డు**

అమర్‌నగర్, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల వైపు నుంచి వచ్చే వారికి రాజీవ్ రోడ్డు, బస్టాండ్ వైపు వెళ్లేవారికి కాలువ కట్ట అనుకూలంగా ఉంటుంది. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, తక్కువ సమయంలో వెళ్లేందుకు అనుకూలంగా వినియోగిస్తున్న కాలువ కట్టపై రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చడం లేదు. గోతులమయమైన ఈ దారిని వాహనదారులు వినియోగించడం ప్రమాదకరంగా మారింది. గతంలో కాలువ గట్టుపై ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. ఇలాంటి పరిస్థితి మున్ముందు రాకుండా ఉండేందుకు బాలిక ఉన్నత పాఠశాల నుంచి రాజీవ్ రహదారి వరకు కాలువపై రోడ్డు నిర్మించడంతో పాటు కాలువ వైపు రక్షణ గోడ నిర్మించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రాధాన్యం

**ధర్మారం, న్యూస్‌టుడే:** మహిళల ఆర్థికాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మారంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం విప్ ప్రారంభించి మాట్లాడారు. భోజనం తయారీ విషయంలో నాణ్యత, శుచి, శుభ్రత పాటించాలన్నారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద 62 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, తహసీల్దారు ఆరీఫ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేశ్, ఏడీఆర్డీవో రవికుమార్, డీపీఎం తిరుపతి, ఏపీఎం తులసీమాత, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆనందం రెండింతలు!



రెండు కల్యాణలక్ష్మి చెక్కులు అందుకుంటున్న కొమురవ్వ

**ధర్మారం:** మండలంలోని నందిమేడారానికి చెందిన వెల్పుల కొమురవ్వ-కొమురయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఇద్దరికి ఇటీవల వివాహం చేశారు. వీరిద్దరికీ కల్యాణలక్ష్మి పథకంలో రూ.1,00,116 చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. రెండు చెక్కులను సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా కొమురవ్వ అందుకుంది.

## మహాసభ విజయవంతానికి పిలుపు

**జ్యోతినగర్ (మార్కండేయకాలనీ):** సీపీఐఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.రామాచారి అన్నారు. ఎన్టీపీసీ మేడిపల్లి కేంద్రంలో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. నాంసాని శంకర్, భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, మల్లేష్, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతో సంస్థ పురోభివృద్ధి

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** సింగరేణి పురోభివృద్ధికి పరస్పర సహకారం అందించుకోవాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ వెల్లడించారు. గుర్తింపు సంఘం నాయకులతో సోమవారం సాయంత్రం స్థానిక జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పారిశ్రామిక సంబంధాలు, గుర్తింపు సంఘం నియమావళిపై మాట్లాడారు. సంస్థ ముందుకు సాగాలంటే పారిశ్రామిక సంబంధాలు మెరుగుపరచుకోవాలన్నారు. ఇరు పక్షాలు ఆమోదయోగ్యమైన వాతావరణాన్ని కల్పించుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. సమస్యలపై సామరస్యపూర్వకంగా అవగాహనకు రావాలని, పని విధానంలో కూడా మెరుగైన నైపుణ్యం ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐటీయూసీ నాయకులు 0రులు ఆంజనేయప్రసాద్, డి.వి.రావు, ఆంజనేయులు, చంద్రశేఖర్, రమేశ్, ధనలక్ష్మిబాయి, పిట్ కార్యదర్శులు, జీఎం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

## అధికారికి ఆత్మీయ సన్మానం

**కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే:** ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ సర్వే విభాగం జనరల్ మేనేజర్ ఎండీ జైనుల్లాబద్దీన్‌ను జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకరరావుతోపాటు ఏరియాలోని వివిధ గనులు, విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఏరియా ఇంజినీర్ యాదయ్య, ప్రాజెక్టు అధికారి రమేశ్, అధికారులు పాల్గొన్నారు.




## ఓసీపీ-5ని సందర్శించిన నాణ్యత జీఎం

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** సింగరేణి కార్పొరేటర్ నాణ్యత జీఎం ఎ.రవి కుమార్ ఓసీపీ-5ని సోమవారం సందర్శించారు. ప్రాజెక్టులోని క్వారీ, ఫీడర్, సీఎస్పీ పని స్థలాలను సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. బొగ్గు నాణ్యత పాటిస్తేనే వినియోగదారుల నుంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, రామగుండం క్వాలిటీ జీఎం బైద్య, డీజీఎం సాయిప్రసాద్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఎస్‌ఓఎం రమేశ్‌బాబు, అధికారులు శ్రీనివాస్, చంద్రమౌళి, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జీఎం రవికుమార్

## సంస్థకు సహకరిస్తాం

**కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే:** సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుతూనే, సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడానికి యాజమాన్యానికి యూనియన్ తరఫున ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్ ప్రసాద్ అన్నారు. ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సోమవారం సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ నూతన కమిటీల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు జనక్ ప్రసాద్‌కు ఆర్జీ-3 జీఎం సుధాకరరావు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల నూతన కమిటీల ప్రతినిధులను పరిచయం చేశారు. జీఎం మాట్లాడుతూ.. 'ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం' అనే నినాదంతో ముందుకెళ్తూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఏ ఏరియా ఇన్‌ఛార్జి జీఎం నాగేశ్వరరావు సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, ఏరియా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మద్దతుతోనే కాంగ్రెస్ విజయం

**పాలకుర్తి (అంతర్గాం), న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కాంగ్రెస్ పార్టీపై రైతులకు పూర్తి భరోసా ఉందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. అంతర్గాం మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతుల ముసుగులో నిరసనల పేరిట ఉనికి చాటుకునే ప్రయత్నాన్ని మాజీ ఎమ్మెల్యే చందర్ మానుకోవాలన్నారు. రైతుల సంపూర్ణ మద్దతుతోనే కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంద్రు హనుమాన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి రాజలింగం, డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.సత్తయ్య గౌడ్, అధికార ప్రతినిధి తిరుపతి, నాయకులు లక్ష్మణ్, కొమురయ్య, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంథని: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



దొంగతుర్తిలో రాజమల్లమ్మను సన్మానిస్తున్న పోలీసులు



కమాన్‌పూర్: పూలమాల వేస్తున్న ఎస్సై ప్రసాద్

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**ధర్మారం, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని సోమవారం ధర్మారం మండలంలో నిర్వహించారు. దొంగతుర్తిలో ప్రధాన కూడలిలోని పోలీసు అమరవీరుడు పాలకుర్తి మల్లేశం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లేశం తల్లి రాజమల్లమ్మను సన్మానించారు. ధర్మారం ఎస్సై-2 రషీద్ అహ్మద్, మల్లేశం కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**మంథని:** మంథనిలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఐ రాజు నివాళులర్పించారు. ఎస్సై రమేశ్, ఏఎస్సైలు మల్లయ్య, గాంధీ సిబ్బంది పాల్గొన్నారు.

**కమాన్‌పూర్:** కమాన్‌పూర్ ఠాణా ఎదుట ఉన్న ఎంఏ సుభాన్ (ఎస్సై) విగ్రహానికి ఎస్సై ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎస్సై బాలాజీనాయక్, దివంగత సుభాన్ కుటుంబసభ్యులు ఇర్ఫాన్, అంజుమ్, అర్షియా, అఫ్రా తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించాలని రాస్తారోకో

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఫీజు రీయింబర్స్‌మెంటు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,550 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని.. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నాయకులు బెజ్జంకి దిలీప్, పర్శ సమ్మయ్య, సదానందం, సందీప్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



రాజీవ్ రహదారిపై నినాదాలు చేస్తున్న నాయకులు

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలి

**మంథని, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ ఉపాధ్యాయులను కోరారు. మంథని పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలశాఖ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్, జిల్లా నాయకుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సుమలత, పరంజ్యోతి, వరలక్ష్మి, మాధవి, భరత్‌రెడ్డి, శేషాద్రి, శ్రీకాంత్, విజయకుమార్, కేశవులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదుపై అవగాహన

**సుల్తానాబాద్:** సుల్తానాబాద్ పట్టణంలో సోమవారం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు. విద్యా వ్యవస్థపై పట్టు ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశమిస్తే విద్యారంగంలో మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ట్రస్మా జిల్లా నాయకులు రమణారావు, శ్రీనివాస్, కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, సభ్యులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## అయోడిన్ ఉప్పుతో రుగ్మతలు దూరం

**పెద్దపల్లి:** అయోడిన్ ఉప్పుతో పలు రకాల రుగ్మతలు దూరమవుతాయని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో అయోడిన్ ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీడీ కార్యక్రమం అధికారి గణేషన్, వైద్యులు రాజమౌళి, జిల్లా కార్యక్రమం సమన్వయకర్త మధుసూదన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ అశోక్‌లు పాల్గొన్నారు.

## నిజాయతీ చాటుకున్న సెక్యూరిటీ గార్డు

**పెద్దపల్లి:** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్గాం గ్రామానికి చెందిన మహిళ పది రోజుల క్రితం తులంన్నర బంగారు గొలుసును పోగొట్టుకుంది. సెక్యూరిటీ గార్డ్ స్వామి వెతకడంతో గొలుసు దొరకడంతో సోమవారం బాధితురాలికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. స్వామిని ఆసుపత్రి పర్యవేక్షకుడు శ్రీధర్, ఆర్‌ఎంవో రవీందర్ అభినందించారు.

## రోడ్డు పనులకు శ్రీకారం

**జ్యోతినగర్ (మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే:** ఎన్టీపీసీ పరిధిలోని మూడవ డివిజన్‌లో రూ.5లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షులు ఆసిఫ్‌పాషాల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి డివిజన్‌లో రోడ్ల వెడల్పు, భూగర్భ వైరింగ్ పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, మల్లేష్, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సున్నపురాయి గనుల భద్రతా వారోత్సవాలు

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని కేశోరాం సున్నపు రాయి గనుల భద్రతా వారోత్సవాలను యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒప్పంద కార్మిక గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశిక హరి హాజరై మాట్లాడారు. భద్రతతో పనిచేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కర్మాగార హెడ్ శ్రీనివాసరెడ్డి, హెచ్ ఆర్ అండ్ ఐఆర్ అధికారి పార్థసారథి, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, కేశోరాం అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

**సుల్తానాబాద్, న్యూస్‌టుడే:** సుల్తానాబాద్‌లో ప్రగతి స్వశక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

***సంచార అల్పాహార వాహనం..***

**పెద్దపల్లి:** పెద్దపల్లిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి ద్వారా రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన సంచార అల్పాహార వాహనాన్ని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్, డీఎంసీ సతీష్, ఏడీఎంసీ మౌనికతోపాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నేర వార్తలు

## కేశోరాం శాశ్వత కార్మికుడి బలవన్మరణం

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** అనారోగ్య సమస్యలతో మనోవేదనకు గురైన కేశోరాం శాశ్వత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. బసంత్‌నగర ఎస్సై స్వామి తెలిపిన వివరాల మేరకు... పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని వర్కర్స్ కాలనీకి చెందిన కన్నం కేశవులు (55) స్థానిక సిమెంట్ కర్మాగారంలో శాశ్వత కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. కేశవులు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో విధులకు గైర్హాజరవుతున్నాడు. తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రెయిలింగ్‌ను ఢీ కొట్టిన వాహనం.. యువకుడి దుర్మరణం

**బెజ్జంకి, న్యూస్‌టుడే:** రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ ఇద్దరూ స్నేహితులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. 108 వాహనంలో ఇద్దరిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతి చెందాడు. అన్విత్ చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ఫిర్యాదు రావాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

## ఇసుక లారీ ఢీకొని తెగిపడిన కాలు

**సుల్తానాబాద్, న్యూస్‌టుడే:** ఇసుక లారీ ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడి కాలు తెగిపడిన ఘటన సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన మేకల మధునయ్య, తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ భూపతిపూర్ వద్ద రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనాన్ని అదే మార్గంలో పెద్దపల్లి వైపునకు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో మధునయ్య కిందపడగా ఆయన కాలు పైనుంచి లారీ వెళ్లడంతో కాలు తెగిపడింది. ఆయన కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. క్షతగాత్రులను స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

## మంథనిలో గంజాయి పట్టివేత

**మంథని, న్యూస్‌టుడే:** మంథని పట్టణంలోని బస్సు డిపో సమీపంలో ఓ యువకుడి వద్ద పోలీసులు గంజాయి పట్టుకున్నారు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం గంజాయితో ఓ వ్యక్తి తిరుగుతున్నాడని అందిన సమాచారంతో వెళ్లి గాలించి.. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని పట్టుకున్నారు. తనిఖీ చేయగా అతడి వద్ద 91 గ్రాముల గంజాయి లభించింది. విచారించగా అతడు మంథని పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన కుడుదల సూర్యవర్ధన్‌గా తేలింది. కొన్ని రోజులుగా మంథని పట్టణానికి చెందిన తైడల సురేశ్, పెండ్యాల సునీల్, ఆసంపల్లి తరుణ్, లక్క రవివర్మలు గంజాయికి అలవాటు పడ్డారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో కార్తిక్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి మంథనిలోని శ్రీపాదకాలనీలో అందరూ కలిసి తాగడానికి వెళ్తున్న క్రమంలో సూర్యవర్ధన్ గంజాయితో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# జాతీయ స్థాయిలో రాణించాలి

**మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే:** క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్‌సీవో క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 48 మంది అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా ఏసీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొంరోజు శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జిల్లా సమన్వయకర్త తగరపు శంకర్, సింగరేణి సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

**పాలకుర్తి (అంతర్గాం):** అంతర్గాం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు భరత్, తరుణ్, చరణ్‌లు రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏకాంబరం తెలిపారు. పీడీ శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

**పెద్దపల్లి:** రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పెద్దపల్లి ట్రినిటీ పాఠశాలకు చెందిన విద్యార్థిని జె.మనస్విని.. రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో ఎన్.మనస్విని, విశ్వజ్ఞలు ఎంపికయ్యారు. వారిని మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అభినందించారు.

**సుల్తానాబాద్:** అండర్-18 బాలికల ఖోఖో విభాగంలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన క్రీడాకారిణి శ్వేత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్- 14 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో మరో విద్యార్థిని ప్రియదర్శిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు యాజమాన్యం పేర్కొంది.



ఖని: ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు, ఏసీపీ, క్రీడా నిర్వాహకులు

# సంక్షిప్తం

### బాధ్యతల స్వీకరణ

**ధర్మారం, కమాన్‌పూర్:** విద్యుత్తుశాఖ ధర్మారం సబ్ డివిజన్ ఏడీఈగా టి.విజయ్ గోపాల్‌సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖిలావనపర్తి ఏఈగా మహిపాల్‌రెడ్డి, జూలపల్లి ఏఈగా హరీశ్ విధుల్లో చేరారు. ఇన్నాళ్లుగా ధర్మారంలో ఏడీఈ కనకయ్య పెద్దపల్లికి, ఖిలావనపర్తి ఏఈగా పనిచేసిన సురేశ్ పెద్దపల్లికి, జూలపల్లి ఏఈ అశోక్ కమాన్‌పూర్ బదిలీ అయ్యారు. ప్రస్తుతం విధుల్లో చేరిన ఏడీఈ మంథని నుంచి ఖిలావనపర్తి, జూలపల్లి ఏఈలు గోదావరిఖని నుంచి బదిలీపై వచ్చారు. ధర్మారం, ఖిలావనపర్తి, జూలపల్లి, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో సబ్ ఇంజినీర్లుగా ప్రణయ్, దిలీప్, దినేశ్, సందీప్ విధుల్లో చేరారు.

### విద్యార్థులకు అవగాహన

**కమాన్‌పూర్:** కమాన్‌పూర్ మండలం గుండారం జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు షీటీం సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ.. సైబర్ క్రైం జరిగితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సీపీఆర్‌పై ..

**సుల్తానాబాద్:** సుల్తానాబాద్ శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు సోమవారం కరీంనగర్ మెడ్‌కవర్ ఆసుపత్రి వైద్యసిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు కమలాకర్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది రోహిణి, కిరణ్, కరుణాకర్, హరీశ్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

**మంథని:** పట్టణంలోని 6వ వార్డు బోయినిపేటలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఛైర్‌పర్సన్ రమాదేవి పరిశీలించారు. నాణ్యతతో, జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఉద్యమకారుల ప్రత్యేక పూజలు

**కమాన్‌పూర్:** కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి ఆలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చాలని స్వామివారి వేడుకున్నట్లు తెలిపారు.

### రామగుండం ఐటీఐలో ప్రవేశాలు

**పాలకుర్తి(రామగుండం):** రామగుండం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్స్) ఆగస్టు 2024 కింద ఆరు కొత్త ట్రేడ్‌లను చేర్చారని, ఏడో విడత ప్రవేశాల కోసం సంబంధిత ధ్రువ పత్రాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని రామగుండం ఐటీఐ ప్రిన్సిపల్ సురేందర్ తెలిపారు. ప్రవేశాలకు ఈనెల 30న చివరి తేదీగా పేర్కొన్నారు. ఆన్‌లైన్ మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

### సంఘాలు- నియామకాలు

**ధర్మారం:** మండలంలోని దొంగతుర్తి మాల సంఘం అధ్యక్షుడిగా మాజీ సర్పంచి జుంజుపల్లి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లింగం రమణ, సభ్యులుగా చంద్రమౌళి, చంద్రమౌళి తదితరులను ఎన్నుకున్నారు.


### రుసుముల విడుదలకు విజ్ఞప్తి

**ధర్మారం:** విద్యార్థులకు చెల్లించాల్సిన బోధన రుసుములు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ధర్మారంలో వినతిపత్రం అందించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి ఆకుల వంశీ, గణేష్, జశ్వంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘన సన్మానం

**ధర్మారం:** ఎన్నికల్లో గెలిచిన తర్వాత మొదటిసారిగా కొత్తూరుకు వచ్చిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు తాజా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తాళ్లపల్లి భద్రమ్మ, మాజీ సర్పంచి లింగయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు.

### సుల్తానాబాద్ కోర్టు ఏజీపీగా ఆంజనేయులు



**సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన దూడం ఆంజనేయులును నియమిస్తున్నట్లు సోమవారం ప్రభుత్వ న్యాయ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి శ్రీరాములు, రమేశ్ తదితరులు అభినందించారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

**ముత్తారం:** మండలంలోని కేజీబీవీని ఎంపీడీవో సురేశ్ సోమవారం సందర్శించారు. పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రైల్వే హమాలీలకు వైద్య శిబిరం

**పెద్దపల్లి:** పెద్దపల్లి రైల్వే హమాలీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంఘం మాజీ అధ్యక్షుడు, పెద్దపల్లి పురపాలిక నాలుగో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి సంస్మరణార్థం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సంపత్, మోహన్, వెంకటేశ్, రవి, సతీశ్ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**పెద్దపల్లి:** ఈ నెల 25న ప్రారంభమయ్యే మాలల మహాపాదయాత్ర పోస్టర్‌ను పెద్దపల్లిలో సోమవారం ఆవిష్కరించారు. దళితుల ఐక్యత కోసం పాదయాత్ర చేపడుతున్నట్లు జైభీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మధు తెలిపారు.

### కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

**ఓదెల:** రూపునారాయణపేట నుంచి విలాసాగర్ మధ్య మానేరుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పొత్కపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ సుమన్‌రెడ్డి, మహేందర్, కొమురయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.